ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5
మంగళవారం 3 సెప్టెంబరు 2024



మాసాయిపేట శివారులో నీట మునిగిన వరి పొలాలు

అతలాకుతలం



జగిత్యాల-గొల్లపల్లి మధ్య నిలిచిన రాకపోకలు

- వర్షాలు, వరదల వల్ల స్వల్పంగా నష్టం
- పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న రహదారులు
- చెరువులకు గండి...వాగులు పొంగిపొర్లడంతో ఇక్కట్లు

వరుణుడి ఉగ్రరూపం జిల్లా వ్యాప్తంగా తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. మొన్న మొన్ననే వరినాట్లు వేసిన రైతన్నలను ఆదిలోనే కోలుకోకుండా చేశాయి. పొలాల్లోకి వర్షపు నీరు చేరి అన్నదాతలకు కన్నీళ్లు మిగిల్చాయి. కొన్ని గ్రామాలకు రహదారులు కూడా పూర్తిగా దెబ్బతిని సంబంధాలు తెగిపోయాయి. చెరువులు, కుంటలు జలకళను సందరించుకున్నా వాగులు ఉప్పొంగి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఎక్కడికక్కడ విరిగిపడి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. నదీ తీర ప్రాంత ప్రజలను కలెక్టర్, ఎస్పీతో పాటు ఉన్నతాధికారులు అప్రమత్తం చేస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలించి వసతులు కల్పించారు.

జగిత్యాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు, వాగులు, చెరువులు పొంగిపొర్లడం వల్ల వచ్చిన వరదలకు పలు నష్టాలు జరిగాయి. ప్రధానంగా విద్యుత్, రహదారులతో పాటు వ్యవసాయ శాఖకు సంబంధించి పలు పంటలకు నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా 10 వివిధ విద్యుత్ పోల్స్ దెబ్బతినగా వీటి మరమ్మతుకు రూ. 86,584 వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఇందులో 11 కేవీ పోల్స్ 3 దెబ్బతినగా మరమ్మతులకు రూ. 37,584, ఏడు ఎల్‌టీ పోల్స్ దెబ్బతినగా వీటి మరమ్మతుకు రూ. 49 వేలు వ్యయం అవుతుందని ట్రాన్స్‌కో అధికారులు అంచనా వేశారు. జిల్లా వ్యాప్తంగా 11 ప్రాంతాల్లో రహదారులు దెబ్బతిన్నాయి. 12 పెంకుటిల్లు పాక్షికంగా కూలిపోయాయి. బీమారం మండలంలో గల పొల్కమ్మ చెరువు, పసునూరు గ్రామ శివారులో గల ఊరకుంటల కట్టలు తెగిగండి పడ్డాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో సుమారు 500 ఎకరాల్లో వరి పొలాల్లో ఇసుక మేటలు వేసినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. జిల్లాలోని వెల్గటూరు మండలం చెగ్యాం, పాశిగామా, ధర్మపురి మండలం రాజారాం గ్రామాల్లో పునరావాస కేంద్రాలను అధికారులు ఏర్పరిచారు. చెగ్యామ్‌లో 16 కుటుంబాలను పున రావాస కేంద్రానికి తరలించారు. రాజారాం గ్రామంలో గల జడ్పీ హెచ్‌ఎస్ భవనంలో ఏర్పాటు చేసిన పునరవాస కేంద్రానికి బాధితులను అధికారులు తరలించారు.

పునరావాస కేంద్రాలకు తరలింపు..

బీర్‌పూర్ మండలంలోని కమ్మునూరు కలమడుగు బ్రిడ్జి వద్ద వరద నీరు ప్రవహిస్తుండడంతో రంగాసాగర్, చిన్న కొల్వాయి గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. వెల్గటూరు మండలం పాశిగామ గ్రామ శివారు వాగులో వరద ఉధృతి ఎక్కువగా ఉండడం వల్ల ముందస్తు చర్యల్లో భాగంగా సమీపంలో ఉన్న 14 కుటుంబాలకు చెందిన 62 మందిని అధికారులు పునరావాస కేంద్రంగా ఏర్పాటు చేసిన హరిత హోటల్‌కు తరలించారు.

రాకపోకలకు అంతరాయం..

జిల్లాలోని పలు ప్రాంతాల్లో వాగులు, చెరువులు పొంగుతుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జగిత్యాల పట్టణంలోని గోవిందుపల్లి వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో అవతలివైపు ఉన్న వెంకటాద్రినగర్‌కు సంబంధాలు తెగిపోయాయి. జగిత్యాల పోలీసులు వాగు వద్ద బారికేడ్లు పెట్టి రాకపోకలు నిలిపివేశారు. మున్సిపల్ అధికారులు జేసీబీల సహాయంతో జనాన్ని ఒడ్డుకు చేరవేస్తున్నారు. జగిత్యాల శివారులోని మోతే వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. సారంగాపూర్ మండలంలోని కోనాపూర్ ఎల్లమ్మ ఆలయం వద్ద తాత్కాలికంగా వేసిన అప్రోచ్ బ్రిడ్జి పూర్తిగా తెగిపోయి నీరు రహదారిపై ప్రవహిస్తోంది. జగిత్యాల రూరల్ మండలం మోతే తాతమ్మ గుడి వ ద్ద గల బ్రిడ్జిపై నుంచి నీరు ఉధృతంగా ప్రవహి స్తుం డడంతో గొల్లపల్లి-జగిత్యాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. జగిత్యాల రూరల్ మండలం పెర్కపల్లి బ్రిడ్జిపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవ హి స్తుండ డంతో జగిత్యాల-రంగంపేట గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

జిల్లాలో మోస్తరు వర్షం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఓ మోస్తరుగా వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా సగటున 6.7 మిల్లీ మీటర్ల వర్షం పడింది. అత్యధికంగా జగిత్యాలలో 11.1 మిల్లీ మీటర్లు, జగిత్యాల రూరల్ మండలంలో 11.0 మిల్లీమీటర్లు, అత్యల్పంగా కొడిమ్యాలలో 4.1 మిల్లీ మీటర్లు, పెగడపల్లి 4.7 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. కాగా జిల్లాలోని సారంగ పూర్‌లో 8.4 మిల్లీ మీటర్లు, ధర్మపురి 8.1, గొల్లపల్లి 8.0, బుగ్గారం 7.8, బీర్‌పూర్ 7.5, రాయికల్ 7.2, బీమారం, మేడిపల్లి 7.0, ఎండపల్లి 5.7, మెట్‌పల్లి 5.3, ఇబ్రహీంపట్నం, వెల్గటూరు 5.2, కథలాపూర్, మల్యాలలో 5.1, మల్లాపూర్‌లో 4.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ సత్య ప్రసాద్

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షా ల నేపథ్యంలో శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్టుల గేట్లు ఎత్తినందున దిగువ గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సత్యప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. 24 గంటల పాటు నీటి వనరులపై నిఘా పెట్టాలని, ముంపు ప్రాంతాల్లో అధికారు లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

నీట మునిగిన ఆకుసాయిపల్లె వంతెన

ధర్మపురి: ధర్మపురి మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బం దులకు గురయ్యారు. రోడ్లు జలమయం కావటం వల్ల అనేక చోట్ల దెబ్బతిని ప్రజలకు నష్టం వాటిల్లింది. ఆకు సాయిపల్లెలో లెవల్ వంతెన నీట మునిగిపోయింది. దీంతో ఉదయం నుంచి వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. కొందరు ప్రయాణికులు ధర్మపురి నుంచి కమలాపూర్, నాగారం మీదుగా జగిత్యాల వెళ్లే ప్రయత్నం చేశారు. ధర్మపురి- జగిత్యాల మధ్య ప్రజా సంబంధాలు తెగి పోయాయి. సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐ మహేష్ సిబ్బందిచే ఆకుసాయిపల్లె గుట్ట వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాలను నిలిపి వేయించారు. ఆకుసాయిపల్లె ఆంజనేయస్వామి ఆలయం చుట్టూ నీరు చేరింది. అక్కపెల్లి చెరువు నిండి జలకళ సంతరించుకుంది. రెవెన్యూ సిబ్బంది వరద పరిస్థితి గురించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.



బోర్నపెల్లి వంతెన వద్ద వరద పరిస్థితిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

రాకపోకల పునరుద్ధరణ

జగిత్యాలరూరల్: జగిత్యాల పట్టణంతో పాటు, జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల్లో సోమవారం స్వల్పవర్షం కురిసింది. రెండు రోజులుగా కు రుస్తున్న వర్షానికి బ్రిడ్జిలపై నుంచి ప్రవహిస్తున్న వరద ఉధృ తి తగ్గు ము ఖం పట్టింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి నీట మునగిన రూరల్ మండ లంలోని అనంతారం బ్రిడ్జి, జగిత్యాల మండలంలోని మోతె, పెరుకపల్లి బ్రిడ్జిల నుంచి రాకపోకలు పునరుద్ధరించారు. పట్టణంలోని గోవిందుపల్లి శివారులో గల హరిహరనగర్, వెంకటాద్రినగర్ కాలనీకి రాకపోకలను అధికారులు పునరుద్ధరించారు. మండలంలోని సోమన్‌పల్లి గ్రామంలో శిథిలావస్థలో ఉన్న ఇల్లు కూలిపోయింది. కూలిపోయే ప్రమాదం ఉన్న ఇండ్లను గుర్తించి రూరల్ తహసీల్దార్ రాంమోహన్ ఆధ్వర్యంలో ఇండ్లలో నివసిస్తున్న వారిని వేరే చోటికి తరలించారు. దెబ్బతిన్న అనంతారం బ్రిడ్జి రహదారిని జగిత్యాల డీఎస్పీ రఘు చందర్ పరిశీలించారు. రూరల్ ఎస్సై సధాకర్ ఉన్నారు.

గోదావరి పరివాహక ప్రాంతాలను పరిశీలించిన అదనపు కలెక్టర్

రాయికల్: అధిక వర్షాల వలన ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టులో నీటిని విడు దల చేయడం వలన మండలంలోని గోదావరి పరివాహక ప్రాంతాలను జగిత్యాల అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డి పరిశీలించారు. బోర్నపెల్లి వంతెన వద్ద గోదావరిలో వరద పరిస్థితిని అక్కడి గ్రామస్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. కుర్రు గ్రామం నుంచి ఐదు కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మండలంలో లోలెవల్ కల్వర్టులు, చెరువులు, శిథిలమైన భవనాలు, వరద ఉధృతికి పాడైన రోడ్ల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. నది తీర ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆ దేశాలు జారీ చేశారు. అదనపు కలెక్టర్ వెంట ఎంపీడీవో చిరంజీవి, తహ సీల్దార్ ఖయ్యూం, ఇరిగేషన్ డీఈఈ భాస్కర్ పాల్గొన్నారు.

కొట్టుకుపోయిన రోడ్లు, మునిగిన పొలాలు

మెట్‌పల్లి రూరల్ : మొన్నటి వరకు నీటి కోసం ఎదురు చూస్తున్న అన్నదాతలకు మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఆరంభం లోనే ఎదురు దెబ్బ తగిలింది. మండలంలోని గ్రామాలు అతలాకుతలంగా మారాయి. భారీ వర్షాలు కురుస్తుడడంతో ఆయా గ్రామాల్లోని వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. దీంతో గ్రామాల్లోని రోడ్లు కొట్టుకుపోగా, పంట పొలాలు నీట మునిగాయి, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండలంలోని కేసీఆర్ తండా గ్రామ ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిన్నది, మాసాయిపేట, కొండ్రికర్ల గ్రామాల మధ్య, అల్లూరిసీ తారామరాజుతండా శివారులోని కల్వర్టుపై నుంచి వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. రామలచ్చక్కపేటలోని ప్రభుత్వ పాఠశాలలోనికి వర్షపు నీరు చేరింది. వెల్లుల్ల అనుబంధ గ్రామమైన మాసాయిపేట శివారులోని మల్లన్న కుంటకు ఉధృతంగా ప్రవహించడంతో చుట్టున్న సుమారు ఇరువై ఎకరాల వరి పంట పొలాలన్నీ నీటితో నిండిపోయాయి.



వెంకటాద్రినగర్‌లో రాకపోకలు పునరుద్ధరిస్తున్న అధికారులు



ధర్మపురి శివారులో మత్తడి దూకుతున్న అక్కపెల్లి చెరువు



వాగులను పరిశీలిస్తున్న మాజీ జడ్పీ చైర్‌పర్సన్ వసంత

నిరాశ్రయులకు బీఆర్‌ఎస్ శ్రేణులు అండగా ఉండాలి

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్

జగిత్యాల అర్బన్: వర్షాల కారణంగా నిరాశ్రయులు, అన్నార్థులైన నిరుపేదలకు బీఆర్‌ఎస్ శ్రేణులు అండగా నిలవాలని మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ పిలుపునిచ్చారు. పట్టణంలోని స్థానిక మోతె, గోవిందపల్లె, గొల్లపెల్లి రోడ్‌పై ఉన్న బ్రిడ్జీలు పొంగిపోర్లడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్న పరిస్థితులను పరిశీలించారు. రోడ్లు వేయడం, బ్రిడ్జులు వేయడం అభినందనీయమే అయినా, వాటికి సైడ్ వాల్స్ నిర్మాణం చేపట్టకపోవడంతో వరదనీరు బ్రిడ్జిలపై నుంచి ప్రవహిస్తుందని, రాత్రి వేళల్లో సైతం వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొందన్నారు. వరదల సమయంలో ఇల్లు కూలిపోయిన నిరాశ్రయులకు, అన్నార్థులకు బీఆర్‌ఎస్ శ్రేణులు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని స్థానిక 30వ వార్డులో ఖిలాగడ్డ ప్రాంతానికి చెందిన దుమాల దుబ్బ రాజవ్వ ఇల్లు పూర్తిగా నీటమునగగా, మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి పునరావాసం కల్పించాలని కోరారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ నాయకులు తుమ్మ గంగాధర్, పడిగెల గంగారెడ్డి, ముత్తయ్య, మాజీ జడ్పీటీసీ మహేష్, రిజ్వాన్, నీలి ప్రతాప్, భగవాన్‌రాజ్ ఉన్నారు.

అనంతారం వాగు పై రాకపోకలు ప్రారంభం

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 2 : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అనంతారం వాగు పొంగడంతో, వాగుపై నుంచిరాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాగా సోమవారం సాయంత్రం వరద ప్రవాహం తగ్గిపోవడంతో బ్రిడ్జిపై నుంచి రాకపోకలు ప్రారంభం అయ్యాయి. వర్షందాటికి బ్రిడ్జిపై రహదారి దెబ్బతినడంతో అంతరాయం నేపథ్యంలో వాహనదారులు ఇతర ప్రత్యామ్నాయమార్గాల్లో ప్రయాణించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ఎండపల్లి, సెప్టెంబర్ 2: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రవాణా సమస్య ఉందని తెలుసుకొని నేరుగా అధికారులతో కలిసి వంతెన నిర్మాణ పనులను ప్రభుత్వ విప్ అడ్లూరి పరిశీలించారు. సోమవారం మండలంలోని రాజారాంపల్లిలో ఆగిన వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. నేరుగా అధికారులను సమస్య అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే తనకు చెప్పండి కాని పనులు ప్రారంభం చేయాలని అధికారులను ఆదేశించారు. వంతెన పనులు పూర్తి అయ్యాయని కరెంట్ సమస్యతో మట్టి నింపి ప్రారంభించడం ఆలస్యం అవుతుందని కాంట్రాక్టర్ విప్ దృష్టికి తీసుకువచ్చారు. కరెంట్ అధికారులతో మాట్లాడి సత్వరమే పరిష్కారం చేయాలని అన్నారు. గ్రామాలలో కరెంట్ పోతుందని కరెంట్ కట్ కాకుండా చూడాలన్నారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకి ప్రజలకి ఇబ్బంది లేకుండా చూడాలని ప్రభుత్వ అధికారులకి, కాంగ్రెస్ నాయకులకి సూచించారు. వైఎస్‌ఆర్ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పూల మాల వేసి నివాళులు అ ర్పించి, పండ్లు పంపిణి చేశారు.

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తాటిపర్తి శైలెందర్ రెడ్డి, గుండాటి జితేందర్ రెడ్డి, మద్దుల గోపాల్, గాజుల విజయ్, గెల్లు శేఖర్, సంగ రమేష్, బాలసాని మల్లేశం, అల్లం సురేష్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండండి

కలెక్టర్‌ను లేఖ ద్వారా కోరిన అర్వింద్

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 2: జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ కలెక్టర్ సత్యప్రసాద్‌కు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే పలు చోట్ల ఆయా గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిన నేపథ్యంలో సహాయక చర్యలు చేపట్టడంతోపాటు, మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు.

తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గోదావరి నదిని పరిశీలించిన ప్రభుత్వ విప్



నదీ ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి



సదర్మాట్ బ్యారేజీని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ధర్మపురి, సెప్టెంబరు 2: నదీ తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచించారు. పట్టణంలోని గోదావరి పరివాహక ప్రాంతాన్ని లక్ష్మణ్‌కుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్ కూడా వేర్వేరుగా పరిశీలించారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సహాయక చర్యలపైన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎవ్వరూ అధైర్యపడొద్దని ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఎప్పటికప్పుడు సహాయక చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

గోదావరి నది, సదర్మాట్ బ్యారేజీలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

ఇబ్రహీంపట్నం: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సత్యప్రసాద్ కోరారు. సోమవారం మండలంలోని కోటికొండపూర్, ఎర్దండి, మూలరాంపూర్ గోదావరి నదిని, సదార్మట్ బ్యారేజీలను ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. గోదావరి నది ప్రవాహం పెరిగే అవకాశం ఉందని ప్రజలు, గోర్ల కాపారులు, మత్స్య కార్మికులు అటువైపు వెళ్లవద్దని సూచించారు. గోదావరి ఎవరు పరివాహక గ్రామాలలో ముంపునకు గురైె ప్రాంతాలను గుర్తించి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండ అధికారులు అందుబాటులో ఉండి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది అందుబాటులో ఉండి రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, తహసీల్దార్ జి.ప్రసాద్, సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్‌ఐ అనిల్ ఉన్నారు.

పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలి

మల్లాపూర్ : అధిక వర్షాలు కురుస్తున్నందున గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తున్నందున అటు వైపు ఎవరిని వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. సోమవారం మండలంలోని వాల్గొండ గ్రామ శివారులోని గోదావరి నది పరివాహక ప్రాంతాన్ని ఎస్పీ అశోక్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. గోదావరిలోని వరద పరిస్థితి, మండలంలోని లోలెవల్ కల్వర్టులు, చెరువులు, శిథిలమైన భవనాలు, వరద ఉధృతికి పాడైన రోడ్ల గురించి అధికారులు, ప్రజలను అడిగి తెలుసుకున్నారు. నది వద్దకు గ్రామస్థులు, రైతులు, గొర్రెల కాపర్లు, మత్స్యకారులు వెళ్లకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నది ప్ర వాహాన్ని ఎప్పటికప్పుడు అధికారులు పరిశీలిస్తుండాలని సూచించారు. ఈయన వెంట డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, ఎస్సై కిరణ్‌కుమార్, తహసీల్దార్ వీర్‌సింగ్, ఇన్‌చార్జి ఎంపీడీవో జగదీష్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.



వాల్గొండ వద్ద గోదావరి నది ప్రవాహం వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్, ఎస్పీ

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

అమ్మబడును

★ కరీంనగర్ టవర్‌కు 1కి.మీ. దూరంలో బొమ్మకల్ వెళ్ళే రోడ్ గోదావరిఖని-హైదరాబాద్ హైవే దగ్గర వరహస్వామి గుడి వద్ద కృష్ణా నగర్ చౌరస్తాలో 20 గజముల షటర్ షాపులు అమ్మబడును. సెల్ : 95736 10777, 70590 68888
AJK- 201568

CHANGE OF NAME

★ I, YUNUS JAFAR KHAN, S/O. JAFAR KHAN, R/O. 3-5-64, INDIRA NAGAR, RAMAGUNDM, PEDDAPALLI. HAVE CHANGED MY NAME AS " YUNUS KHAN" S/O.JAFAR KHAN.
AJK-15871

పాస్‌పోర్ట్ పోయినది

★ కోమల్ల అయిలయ్య తండ్రి : కనకయ్య, ఇ.నెం. 6-89, గ్రామం : పచ్చునూర్, మం: మానకొండూర్, జిల్లా : కరీంనగర్. తేది: 24-08-2024న నేను పచ్చునూర్ నుండి మానకొండూర్‌కు వెలుతున్న ప్రయాణ సమయంలో నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ పోయినది. పాస్‌పోర్ట్ నెం.J 4294753, జారీ తేది: 24-03-2011, దొరికిన వారు అందజేయగలరు. 91210 91106
AJK-15872

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.

పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి

కరీంనగర్ :- సెల్ : 9703618691, 9985410640
జగిత్యాల :- సెల్ : 9985411262
మెట్‌పల్లి :- సెల్ : 7013142966
వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 9985411063
పెద్దపల్లి :- 9550900238




రూ.53 లక్షలకు ఇసుక వేలం

జమ్మికుంట రూరల్, సెప్టెంబర్ 2: జమ్మికుంట మండలం శంభునపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పరిమల కాలనీలో అక్రమంగా నిల్వ ఉంచిన 1500 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను అదే గ్రామానికి చెందిన ఎస్ రమేష్ అనే వ్యక్తి బహిరంగ వేలం ద్వారా రూ.53లక్షలకు సోమవారం దక్కించుకున్నాడు. వేలంలో రెవెన్యూశాఖ అధికారులు పాల్గొన్నారు.







గొల్ల, కురుమలకు సబ్సిడీ రుణాలు అందజేయాలి


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్

భగత్‌నగర్, సెప్టెంబరు 2: ప్రభుత్వం గొల్ల, కురుమలకు 75 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేయాలని గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొమ్ము అశోక్‌యాదవ్ అన్నారు. సోమవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న గొర్రెకాపరుల సహకార సంఘ సొసైటీ ఎన్నికల్లో ఉత్సాహంగా పనిచేయలన్నారు. స్వర్గీయ కాలువ నర్సన్న యాదవ్ ఆశయ సాధన కోసం పనిచేయాలన్నారు. ప్రమాదవశాత్తు పిడుగుపాటు, పాముకాటుతో చనిపోయిన వారికి పది లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. గొర్రెల కాపరులకు ఫారెస్ట్ అధికారుల వేధింపులు అరికట్టాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కటిక రెడ్డి బుచ్చన్నయాదవ్, రాష్ట్ర కార్యదర్శి కదారి ఐలయ్య, చిగుర్ల శ్రీనివాస్, నందనవేని ప్రసాద్, జంగం కొమురన్న, గూడెం శ్రీనివాస్ రాజు, దాడి రాజబాబు, గంగంలింగయ్య, రాధారపు కుమార్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో నష్టపోయిన వారిని ఆదుకోవాలి

భగత్‌నగర్, సెప్టెంబరు 2: భారీ వర్షాలతో నష్టపోయిన వారిని ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్‌లోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా అనేక గ్రామాలకు రాకపోకలు స్తంభించి పోయాయన్నారు. చోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమై కాలనీలు నీట మునిగాయన్నారు. ఇసుక మేటలతో పంట పొలాలు దెబ్బతిన్నాయన్నారు.ఇళ్లు కూలిపోయిన వారిని వెంటనే ఆదుకోవాలన్నారు. కరీంనగర్‌లో హైడ్రా తరహాలో సంస్థను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా కమిటీ సభ్యుడు నరేష్‌పటేల్, నాయకులు పున్నం రవి, చెలకాని శ్రీనివాస్, ఎం.ప్రశాంత్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మిల్కూరి వాసుదేవరెడ్డి



విజేతగా నిలిచిన రామగుండం ఎన్టీపీసీ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న అధికారులు

బ్యాడ్మింటన్ విజేత
రామగుండం ఎన్టీపీసీ జట్టు

జ్యోతినగర్, సెప్టెంబరు 2 : కర్నాటకలోని కుడిగి ఎన్టీపీసీలో జరిగిన ఇంటర్ రీజినల్ స్పోర్ట్స్ మీట్ 2024లో రామగుండం ప్రాజెక్టు జట్టు బ్యాడ్మింటన్‌లో విజేతగా నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్స్‌లో రామగుండం ఎన్టీపీసీ ఆటగాళ్లు సింగిల్స్, డబుల్స్‌లో విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచారు. హరీష్‌కుమార్ నాయకత్వంలోని రామగుండం ఎన్టీపీసీ జట్టు సభ్యులు రాంబాబు, రాజేశ్, శోభన్‌బాబు, సోహన్ సింగ్, వీరబాబు, టీం మేనేజర్ జి.భానేశ్వర్, కోఆర్డినేటర్ లను ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాడు అభినందించారు.







తెరుచుకున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లు

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	2,51,250	3,30,781	80.5	73.00
ఎల్లంపల్లి	2,78.326	4.02.023	20.175	14.181
మిడ్ మానేరు	46,272	6.400	27.54	19.55
ఎల్ఎండీ	9.718	273	24.034	15.788
ఎగువమానేరు	27,500	------	2.00	2.00

- 40 గేట్లు ఎత్తి దిగువకు 2 లక్షల క్యూసెక్కుల నీరు
- వరద కాలువకు 7 వేల క్యూసెక్కులు
- ప్రాజెక్టులోకి 2.51 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


జగిత్యాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి సోమవారం భారీగా వరద రావడంతో 40 గేట్లు ఎత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇన్‌ఫ్లో భారీగా కొనసాగింది. దీంతో ప్రాజెక్టుకు చెందిన గేట్లను విడతల వారీగా ఎత్తి 2 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. వరద కాలువకు సైతం 7 వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. ప్రాజెక్టులోకి 2,51,250 క్యూసెక్కుల ఇన్‌స్టంట్ ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 73 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుం చి 40 గేట్లు ఎత్తి 2 లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతుండగా, కాకతీయ కాలువకు 3 వేల క్యూసెక్కులు, వరద కాలువకు 5 వేల క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని వదిలారు.

ఉదయం 6 గంటలకు వరద కాలువకు 1,500 క్యూసెక్కులు విడుదల చేయగా, 7 గంటలకు ఇన్‌ఫ్లో ఎప్పటికప్పుడు పెరుగుతుండడంతో 3 వేల క్యూసెక్కులు, 10 గంటల నుంచి 5 వేల క్యూసెక్కులకు, సాయంత్రం 4 గంటలకు 7వేల క్యూసెక్కులకు పెంచారు. గోదావరి తీర ప్రాంత ప్రజలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎస్సారెస్పీ, రెవెన్యూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ధర్మపురి, కోటిలింగాల వద్ద ఉధృతంగా గోదావరి

ధర్మపురి: ధర్మపురి వద్ద గోదావరి నది వరద సోమవారం సాయంత్రం ఉధృతంగా ఉంది. ఎగువ ప్రాంతాల్లో కురి సిన భారీ వర్షాలకు అనేక గ్రామాల్లో వాగులు, చెరువులు, కుంటలు నిండి పోయాయి. కడెం ప్రాజెక్టు గేట్లు తెరచి గోదావరిలోకి విడుదల చేశారు. దీంతో గోదావరి నీటి మట్టం క్షణ క్షణం పెరిగి వేగంగా ప్రవాహం కొనసాగింది. సత్యవతి, బ్రహ్మగుండం పైనుంచి వేగంగా నీటి ప్రవాహం కొనసాగడం వల్ల సంతోషిమాత, మంగళిగడ్డ, సోమవిహార్ స్నానఘట్టాలు నీటిలో మునిగి పోయాయి. భక్తులను లోతు ప్రదేశాలకు వెళ్లి స్నానాలు చేయకుండా ఆలయ సిబ్బంది మైకుల ద్వారా ప్రచారం చేసి అప్రమత్తం చేశారు. అలాగే నదీ తీరాన గల పలు గ్రామాలకు చెందిన ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.


ధర్మపురి వద్ద గోదావరి ఉధృతి


ఎస్సారెస్పీ వద్ద గేట్ల ద్వారా దిగువకు వెళ్తున్న నీరు

● వెల్గటూర్: కోటిలింగాల వద్ద సోమవారం వరద ఉధృతి పెరిగింది. స్నాన ఘట్టాలపైకి నీరు చేరింది. తహసీల్దార్ శేఖర్, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై ఉమా సాగర్‌లు ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేస్తూ లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. కోటిలింగాల, చెగ్యాం వద్ద గోదావరి పరివాహక ప్రాంతాలలో పర్యటించి, ప్రజలు గోదావరిలోకి వెళ్ల వద్దని హెచ్చరించారు. చేపలు పట్టే వారు చేపల వేటకు వెళ్లవద్దని, పశువుల కాపర్లు గోదావరిలోకి వెళ్లవద్దని హెచ్చరించారు.

ఎల్లంపల్లి నుంచి భారీగా నీటి విడుదల

అంతర్గాం : అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి గ్రామ శివారులో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు 32గేట్లు ఎత్తి సోమవారం గోదావరిలోకి నీటిని విడుదల చేస్తున్నట్టు ఎల్లంపల్లి అధికారులు తెలిపారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రాజెక్టులోకి ఎగువన గల కడెం ప్రాజెక్టు నుంచి 40,250 క్యూసెక్కులు, వాగులు, కుంట ల ద్వారా మొత్తం 2,78,326 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఎల్లంపల్లి అధికారులు 32 గేట్లను ఎత్తి 4,02,023క్యూసెక్కుల నీటిని దిగువన గల గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175టీఎంసీలకు ప్రస్తుతం ప్రాజెక్టులోకి 14.181 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టులోకి ఇంకా వరద ఉధృతి కొనసాగుతుండగా అధికా రులు మరిన్ని గేట్లు ఎత్తే అవకాశం ఉన్నది. గేట్లు ఎత్తడంతో గోదావరి తీర ప్రాంతగ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.

గాయత్రీ పంప్‌హౌస్ నుంచి నీటి విడుదల నిలిపివేత

● ప్రారంభం నుంచి 205 టీఎంసీల నీరు ఎత్తిపోత

రామడుగు: మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రీ పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి నీటి విడుదలను కొనసాగించిన అధికారులు సోమవారం నిలిపివేశారు. నెలరోజులుగా ఇక్కడి నుంచి మిడ్ మానేరుకు 24.2 టీఎంసీల నీటిని రిజర్వ్ చేశారు. ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తుండటంతో పాటు అన్ని జలాశయాలలో నీరు ఉండటంతో నీటి విడుదలను ఆపివేసినట్లు అధికారులు చెబుతున్నారు. గాయత్రీ పంప్‌హౌస్ ప్రారంభమైనప్పటి నుంచి నేటి వరకు 205 టీఎంసీల నీటిని విడుదల చేశారు. ఒక్కో టీఎంసీతో పది వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతుండగా మొత్తం 20లక్షల50 వేల ఎకరాలకు సాగు నీరు అందించినట్లు అయింది.


ఎల్ఎండీ ప్రాజెక్టులో నీరు

మిడ్ మానేరుకు భారీగా వరద

బోయినపల్లి: శ్రీరాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి ఎగువ భాగాన కురిసిన వర్షాలతో మానేరు, మూల వాగు ద్వారా భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టులో నీటి నిల్వ గణనీయంగా పెరుగుతోంది. ప్రాజెక్టులోకి 46,272 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఇందులో మానేరు, మూలవాగు, వరద కాలువ క్యాచ్‌మెంట్ల ద్వారా 41,271 ఎస్సారెస్పీ నుంచి 5 వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. గాయత్రీ పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోతలను నిలిపివేశారు. అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6,400 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు ఎగువ భాగాన కురిసిన భారీ వర్షాలకు ఆదివారం సాయంత్రం వరకు 15.30 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉండగా సోమవారం 19.55 టిఎంసిలకు చేరుకుంది.

పెరుగుతున్న ఎల్ఎండి నీటి మట్టం

తిమ్మాపూర్: రెండు, మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఆదివారం ఉధృతంగా ప్రవహించిన మోయతుమ్మెద వాగు సోమవారం వర్షం తగ్గుముఖం పట్టడంతో ఉధృతి కూడా తగ్గింది. ఎల్ఎండిలో ప్రస్తుతానికి 24.034 టీఎంసీలకు 15.754టిఎంసిల నీరు నిల్వ ఉండగా, మోయతుమ్మెద వాగు ద్వారా 7,887క్యూసెక్కులు, ఎగువ ఎల్ ఎండి నుండి 1,831క్యూసెక్కులు మొత్తం 9,718 క్యూసెక్కుల నీరు ఎల్ఎండిలోకి ఇన్‌ఫ్లోలు వస్తుండగా 273క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో వెలుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. భారీ వర్షాలు కురుస్తుండటంతో ఇరిగేషన్ అధికారులు ఎల్ఎండీ వద్ద ఉండి పర్యవేక్షిస్తున్నారు.

ఉప్పొంగుతున్న మానేరు

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు పరవళ్లుతొక్కుతూ పోటెత్తుతోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సిద్దిపేట జిల్లాలోని కూడవెల్లి వాగు, కామారెడ్డి జిల్లాలోని పాల్వంచ వాగు పోటెత్తి ఉధృతంగా ప్రవహిస్తుంటంతో మానేరులోకి వరద నీరు భారీగా వస్తోంది. దీంతో అధికారులు మానేరు వాగు పరివాహక ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. రైతులు, మత్స్యకారులు అటువైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుం టున్నారు.

వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

కోరుట్ల, సెప్టెంబరు 2 : కోరుట్ల పట్టణానికి చెందిన రియల్టర్‌ను బెదిరించి డబ్బుల వసూళ్లకు పాల్పడ్డ అయిలాపూర్ గ్రామానికి చెందిన సుందరగిరి లక్ష్మీనర్సయ్యగా అనే వ్యక్తిని కోరుట్ల పోలీసులు అరెస్టు చేసినట్లు సీఐ సురేష్ బాబు తెలిపారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అరెస్టు వివరాలను ఎస్ఐ శ్రీకాంత్‌తో కలిసి వెల్లడించాడు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో ఉంటున్న దాసరి రాజశేఖర్ అలియాస్ టీవీ శేఖర్ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారికి లక్ష్మీనర్సయ్య ఫోన్ చేసి మొదట కోటి రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. కొద్ది రోజులకు ప్రకాశం రోడ్డులోని రాజశేఖర్ టీవీ సర్వీసింగ్ సెంటర్‌కు వచ్చిన సదరు వ్యక్తి రూ. 10లక్షలు ఇవ్వాలని లేకుంటే చంపుతానని బెదిరించాడు. దీంతో వెంటనే రాజశేఖర్ పోలీసులకు సమాచారం అందించాడు. ఈ మేరకు ఎస్ఐ శ్రీకాంత్ తన సిబ్బందితో ఆ ప్రాంతంలో నిఘా ఉంచాడు. ఆదివారం సాయంత్రం మరో మారు రాజశేఖర్ వద్దకు సదరు వ్యక్తి వచ్చిన విషయం తెలుసుకున్న ఎస్ఐ శ్రీకాంత్ తన సిబ్బందితో అక్కడి చేరుకుని మాటు వేసి పట్టుకున్నారు. ఆ వ్యక్తిని పోలీసు స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. అతని వద్ద సెల్ ఫోన్, ద్విచక్ర వాహనం, కత్తి స్వాధీనం చేసుకున్నారు. రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఎస్ఐ శ్రీకాంత్, కానిస్టేబుళ్లు ఎల్లయ్య, పురిషోత్తం, శ్రీనివాస్‌లను సీఐ అభినందించారు.

గల్లంతైన మత్స్యకారుడి మృతదేహం లభ్యం

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 2: పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని కూనారం గ్రామ శివారులోని పెద్ద చెరువులో చేపలు బయటకు వెళ్లకుండా వలలు కట్టడానికి వెళ్లి గోస్కుల కుమార్(45) ఆదివారం గల్లంతయ్యాడు. గాలింపు చర్యల్లో సోమవారం మృతదేహం లభ్యమైంది. మృతిచెందిన కుమార్ కరీంనగర్ జిల్లా వీణవంక మండలం బేతిగల్ గ్రామ వాసి. చెరువులో నుంచి చాపలు బయటికి వెళ్లకుండా ముత్తడి వద్ద వలలు కట్టడానికి గోస్కుల కుమార్, కలవేన మొగిలి, సాగర్ల తిరుపతి, చేతి నరసయ్య వెళ్లగా వరద ప్రవాహానికి గోస్కుల కుమార్ గల్లంతయ్యాడు. పెద్దపల్లి ఏసీపీ జి కృష్ణ సంఘటన స్థలానికి చేరుకొని పోలీసులను మత్స్య కార్మికులను రెస్క్యూ టీం సభ్యులను అప్రమత్తం చేశారు. ఉదయం నుంచే చెరువులో గాలింపు చేపట్టగా కుమార్ మృతదేహం లభ్యమైంది. కుమార్ మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు బోరున విలపించారు. బతుకుదెరువు కోసం వచ్చి ప్రాణాలు కోల్పోవడంతో అటు మృతుడి గ్రామం ఇటు కునారంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఏసీపీ వెంట సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ వెంకటేష్, ఇన్‌చార్జి తహసీల్దార్ శంకర్, ఎంపీడీవో రామ్మోహన్‌చారి, ఎంపీవో గోవర్దన్, పోలీసులు అధికారులు ఉన్నారు.

చికిత్స పొందుతూ ట్రాన్స్‌కో ఫోర్‌మన్ మృతి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 2: ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ట్రాన్స్‌కో ఫోర్‌మన్ అజ్మీర సారయ్య(53) సోమవారం మృతి చెందాడని రెండో ఠాణా పోలీసులు తెలిపారు. కరీంనగర్ భాగ్యనగర్‌లో నివాసం ఉంటున్న అజ్మీర సారయ్య కరీంనగర్ టౌన్-5 టవర్‌సర్కిల్ ప్రాంతంలో ఫోర్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆగస్టు 30న రాత్రి విధులు ముగించుకుని ఇంటికి బైక్‌పై వెళుతుండగా భాగ్యనగర్ అప్నాబజార్ కిరాణంషాపు చౌరస్తా వద్ద గణేష్ మండపం ఏర్పాటు కోసం రోడ్డుపై నిర్లక్ష్యంగా వదిలిన భారీ ఇనుప బల్లలను బైక్ ఢీకొట్టింది. దీంతో కిందపడిన అజ్మీర్ సారయ్య కాలు, ముఖం, నడుం భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తుండగా సోమవారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. గణేష్ మండపాల నిర్వాహకులు నిర్లక్ష్యంగా భారీ ఇనుప బల్లలను రోడ్డుపై వదలిన కారణంగా తన తండ్రి ప్రమాదానికి గురై మరణించాడని, వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి కొడుకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బోవెరాను ఆదర్శంగా తీసుకోవాలి

● సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 2: ప్రతి ఒక్కరూ డాక్టర్ బోయినపల్లి వెంకటరామారావు(బోవెరా)ను ఆదర్శంగా తీసుకోవాలని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. బోవెరాలా పనిచేసే 360 డిగ్రీల యువ నాయకత్వం సమాజానికి కావాలని ఆయన అన్నారు. సోమవారం కరీంనగర్‌లోని పద్మనాయక కల్యాణ మండపం హాల్-2లో బోవేరా సంస్థల ఆధ్వర్యంలో బోవేరా 104వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా బోవెరా విగ్రహానికి పూల మాలలు వేశారు. బోవెరా సంస్థల అధ్యక్షుడు బోయినపల్లి హనుమంతరావు స్వాగతోపన్యాసం చేశారు. గద్దర్‌కు మరణానంతరం గద్దర్ కుమారుడు సూర్యకిరణ్ దంపతులకు గాయకుడు, కవి అందెశ్రీతో పాటు ఇతర అతిథుల చేతుల మీదుగా బోవెరా కవితా పురస్కారాన్ని అందజేశారు. ఈసందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బోవేరా మద్యనిషేధం, గ్రంథాలయోద్యమం, అంటరానితనం నిర్మూలన, వయోజన విద్య, హిందీ భాషా ప్రచారం, భూదాన ఉద్యమాల ద్వారా ప్రజల్ని ప్రభావితం చేశారని అన్నారు. బోవెరా పేరుతో ఆయన స్వగ్రామం తోటపెల్లిలో ఒక కళాక్షేత్రం, స్మారక ఆశ్రమం ఏర్పాటు చేయాలనుకోవడం హనుమంతరావు గొప్పతనానికి నిదర్శనమని అన్నారు.

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ సమాజం కోసం జీవితాన్నే త్యాగం చేసిన బోవెరా మన గడ్డపై పుట్టడం గర్వకారణమని అన్నారు. అందెశ్రీ మాట్లాడుతూ బోవెరా విగ్రహం ఏర్పాటు చేయాలని అన్నారు. ఎమ్మెల్సీ మధుసూదనాచారి మాట్లాడుతూ తాను ఎంచుకున్న జీవన విధానంలో బొవేరా కృతకృత్యులయ్యారన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకుడు పృథ్వీరాజ్ వ్యాఖ్యాత మాడిశెట్టి గోపాల్, పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు, కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు, నగర వాసులు, బొవేరా అభిమానులు, స్వాతంత్ర్య సమరయోధులు పాల్గొన్నారు.


గద్దర్ కుమారుడు సూర్యకిరణ్ దంపతులకు బోవెరా పురస్కారంతో సన్మానం

ప్రమాదవశాత్తు మహిళ మృతి


లక్ష్మి (ఫైల్)

వీర్నపల్లి, సెప్టెంబరు 2 : వీర్నపల్లి మండలం మద్దిమల్ల తండా గ్రామ పరిధిలోని లొద్ది తండాలో సోమవారం పాడి గేదె నెట్టడంతో గిరిజన మహిళ మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన మాలోతు లక్ష్మి (52) పాడి గేదెను తాడుతో పట్టుకొని మేత మేపేందుకు వెళ్తోంది. వెనక నుంచి గేదె నెట్టడంతో ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో పట్టుకున్న తాడు ఆమెకు చుటుకొని కింద పడింది. తలకు, మెడ నరాలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది. మృతురాలికి భర్త రాజ్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 2: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని బస్టాండు ప్రాంతంలో కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై సోమవారం కారు, ఆటో ఢీకొన్న ఘటనలో నారాయణపూర్‌కు చెందిన ఆటో డ్రైవర్ నర్సయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. నర్సయ్య తన ఆటోను నడుపుకుంటూ బస్టాండు వైపునకు వెళ్తున్నాడు. గొల్లపల్లి నుంచి సిరిసిల్ల వైపునకు వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో నర్సయ్యకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాటిపల్లి బాలికల గురుకులం ఖాళీ

● మూడు రోజుల పాటు విద్యార్థులకు సెలవు
● శిథిల భవనాలు.. భారీ వర్షాలే కారణం

మల్యాల, సెప్టెంబరు 2: మల్యాల మండలం తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులను ఇంటికి పంపించారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఇక్కడి విద్యార్థులకు సోమవారం నుంచి మూడు రోజుల పాటు సెలవు ప్రకటించారు. దాదాపు నలభై ఏళ్ల క్రితం ఎస్సారెస్పీ కెనాల్ తవ్వకం సందర్భంగా ఏర్పాటు చేసిన సిబ్బంది క్వార్టర్స్‌లో గురుకుల పాఠశాల ఏర్పాటు చేయగా అప్పటి నుంచి సగంకు పైగా ఆ భవనాలనే కొనసాగిస్తుండడం, మరి కొన్ని భవనాలు శిథిలవస్థకు చేరి కూలే దశకు చేరుకోవడంతో వర్షాలతో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా విద్యార్థులను ఇంటికి పంపించారు. ప్రస్తుతం పాఠశాలలో 475, కళాశాలలో 171 మంది విద్యనభ్యసిస్తున్నారు. 2018లో కళాశాల ఏర్పాటు చేసినప్పటికీ భవనాలు నిర్మించకపోవడం, పాత, శిథిల భవనాలలో తరగతులు నిర్వహించడం, చిల్లులు పడిన రేకుల గదులలోనే విద్యార్థులు పడుకోవడం తదితర అనేక సమస్యలను విద్యార్థులు ఎదుర్కొంటు న్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో విద్యార్థులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉండడంతో ఆది, సోమవారాల్లో విద్యార్థులను ఇంటికి పంపించారు. ఈ విష యమై పాఠశాల, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మానసను వివరణ కోరగా శిథిల, పాత భవనాలు సమస్యాత్మకంగా ఉన్న చోట్ల విద్యార్థులను ఇంటికి పంపించాలనే గురుకులాల సొసైటీ అధికారుల సూచన మేరకు విద్యార్థులకు మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించి ఇంటికి పంపించినట్లు తెలిపారు



తాటిపల్లి బాలికల గురుకుల కళాశాల

ఏఐఎస్ఎఫ్ న్యాయ విద్య విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా బాలసాని లెనిన్

పెద్దపల్లి రూరల్ , సెప్టెంబరు 2: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన బాలసాని లెనిన్‌ను ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర న్యాయ విద్య విభాగం కన్వీనర్‌గా నియామకం అయ్యారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ తెలంగాణలో న్యాయ విద్య విద్యార్థుల కోసం ప్రత్యేకంగా లా వింగ్ ఏర్పాటు చేశామని ఈ వింగ్ రాష్ట్రంలోని న్యాయ విద్యార్థుల పక్షాన పోరాటాలు చేస్తుందన్నారు. తన నియామకానికి సహకరించిన ఏఐఎస్ఎఫ్ జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి లెనిన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జ్వరంతో వ్యవసాయ కూలీ మృతి

ఓదెల, సెప్టెంబరు 2: మండలంలోని పొత్కపల్లికి చెందిన సిరిసేటి భాగ్యలక్ష్మి (60) అనే వ్యవసాయ కూలీ సోమవారం జ్వరంతో మృతి చెందింది. 15 రోజుల నుంచి జ్వరంతో ఉన్న భాగ్యలక్ష్మి విధిలేని పరిస్థితిలో ఆదివారం కూలిపనికి వెళ్లగా అక్కడ తీవ్ర అస్వస్థకు గురై కుప్ప కూలింది. ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు


గాయపడ్డ బాలుడు

కోనరావుపేట, సెప్టెంబర్ 2 : కోనరావుపేట మండలం కనగర్తి గ్రామంలో పిచ్చికుక్క దాడి చేయగా పలువురికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన బడే ధృవన్, ఓదెల రమ్య, మోకాళ్ల లచ్చిరెడ్డిలు కిరాణా షాపునకు వచ్చి ఇంటికి వెళుతుండగా పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. కాగా లింగంపల్లి రవికి చెందిన లేగ దూడపై పిచ్చికుక్క దాడి చేయగా గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ముగ్గురిని ఆసుపత్రికి తరలించారు.

మహిళా సంఘాల ధర్నా

● రూ.12.5 లక్షలు స్వాహా చేసిన ఆర్‌పీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



కరీంనగర్‌లో నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 2: మహిళా సంఘాల గ్రూపులకు చెందిన రూ.12.50 లక్షలను ఫోర్జరీ సంతకాలతో స్వాహా చేసిన ఆర్‌పీపై చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల సభ్యులు సోమవారం బల్దియా ఎదుట ధర్నా నిర్వహించారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి మాట్లాడుతూ మహిళా సంఘాల గ్రూపు డబ్బులను వాడుకున్న ఆర్‌పీపై చర్యలు తీసుకొని బాధిత మహిళలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 11వ డివిజన్ కట్టరాంపూర్‌కు చెందిన గణేశ్ సమైఖ్య ఆధ్వర్యంలో దాదాపు 20 మహిళా స్వశక్తి గ్రూపులు ఉన్నాయన్నారు.

ఈ సమైఖ్యకు గాదం అరుణ ఆర్‌పీగా వ్యవహరిస్తున్నారన్నారు. బ్యాంకులో డబ్బులు వేస్తున్నాని చెప్పి 12 లక్షల 50వేల రూపాయలను స్వంతానికి ఆమె వాడుకున్నారని, గ్రూపు సభ్యులకు తెలియకుండా వారి సంతకాలను ఫోర్జరీ చేశారని ఆరోపించారు. వెంటనే ఆమె నుంచి ఆ డబ్బులను రికవరీ చేసి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విచారణ జరిపి ఆర్‌పీపై చర్యలు తీసుకుంటామని అడిష నల్ కమిషనర్ సువార్త, మెప్మా పీఆర్‌పి అనిత హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ఉపాధ్యక్షురాలు ద్యావ అన్నపూర్ణ, నాయకురాళ్ళు పి.దేవేంద్ర, సమైకర్య అధ్యక్ష, కార్యదర్శులు కుంటా సుప్రజ, చంద్రకళ, పూనా నవ్య, కోశాధికారి తాడెం శ్రీలత, వంగల జ్యోతి, సభ్యులు పాల్గొన్నారు.

వర్షం.. నష్టం

ఉమ్మడి జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పలు చోట్ల నష్టం వాటిల్లింది. పెద్ద ఎత్తున వరద నీరు ప్రవహించడంతో రోడ్లు కోతకు గురయ్యాయి. పంటలు నీట మునుగడంతో రైతులు నష్టపోయారు. చెరువుల నిండి కట్టలు తెగిపోయి రోడ్లకు గండ్లు పడ్డాయి.


కథలాపూర్ మండలం ఇప్పపల్లి వద్ద తెగిపోయిన వేములవాడ-కోరుట్ల రహదారి


మెట్‌పల్లి మండలం మాసాయిపేట శివారులో ధ్వంసమైన రహదారి


ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలో కోతకు గురైన పొలం


గోదావరిఖనిలో నీటిలో చిక్కుకున్న లారీ


జగిత్యాల రూరల్‌లో అనంతారం బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి


పెద్దపల్లిలో నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

ఉప్పొంగిన వాగులు..తెగిన రహదారులు

●జిల్లా వ్యాప్తంగా భారీ నష్టం

●పరిశీలించిన ప్రజాప్రతినిధులు, అధికారులు



మల్లాపూర్, మొగిలిపేట గ్రామాల మధ్యలోని లోలెవల్ కల్వర్టుపై ప్రవహిస్తున్న నీరు

కథలాపూర్, సెప్టెంబరు 2 : భారీ వర్షాలకు మండలంలోని ఇప్పపల్లి శివారులో వేములవాడ-కోరుట్ల రహదారిపై తెగిన రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టి రవాణా సదుపాయాలను మెరుగు పరచాలని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. సోమవారం తెగిన రోడ్డును అధికారులతో కలిసి పరిశీలించారు. అదేవిధంగా గంభీర్‌పూర్ కొచ్చెరువు గత ఏడాది తెగిపోగా రు. 28 లక్షలతో పనులు పూర్తి చేయించగా ప్రస్తుతం నిండుకుండలా మారగా ఆ చెరువును పరిశీలించారు. తాండ్ర్యాల ఊరచెరువు మత్తడి పనులను పూర్తి చేసిన నేపథ్యంలో చెరువును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బొమ్మెన ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టంతో కళకళలాడుతున్న క్రమంలో ప్రాజెక్టును చూసి రైతులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, పులి హరిప్రసాద్, కల్లెడ గంగాధర్, గోపిడి ధనుంజయ్‌రెడ్డి, పిడుగు తిరుపతిరెడ్డి ఉన్నారు.



మల్యాల మండలం గొల్లపల్లెలో కూలిన ఇల్లు

కొడిమ్యాల : రెండు రోజులుగా మండలంలో కురిసిన భారీ వర్షాల కారణంగా కోతకు గురవుతున్న మండలంలోని సంద్రల్లపల్లి బ్రిడ్జ్‌ను సోమవారం జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్ రహ్మాన్ పరిశీలించారు. బుగ్గ వాగుపై నిర్మించు బ్రిడ్జ్ స్థలాన్ని, కోనాపూర్ గ్రామంలోకి వెళ్లే దారిలో రెండు లో లెవల్ కల్వర్టులను, గంగారాం తండాలోని బ్రిడ్జ్‌ను అధికారులు పరిశీలించారు. వర్షాకాలంలో వాగు పారిన సమయంలో సమస్యలను ఎదుర్కొంటున్న కోనాపూర్ గ్రామసుస్థులు అధికారుల ముందు గోడు వెల్లబోసుకున్నారు. సంబంధిత అధికారులు యుద్ధప్రాతిపదికన పరిశీలించి బ్రిడ్జ్‌ల నిర్మాణానికి అవసరమయ్యే నిధులను గురించి ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపినట్లు తెలిపారు. జిల్లా అధికారి వెంట మల్యాల డీఈఈ చంద్రశేఖర్, కొడిమ్యాల ఏఈఈ చంద్రశేఖర్ తహసీల్దార్ రాజమణి, ఆర్.ఐ కరుణాకర్, కోనాపూర్ ఉన్నారు.

మల్యాల: రెండు రోజులుగా కురిసి వర్షంతో పంటలకు నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోతున్నారు. మండలంలోని ఓగులాపూర్, గొర్రెగుండం, మద్దుట్ల, మల్యాల గ్రామాలలో వరి పంటలలో ఇసుక మేటలు వేయగా పలు గ్రామాల్లో వర్షానికి ఇళ్లు దెబ్బతిన్నాయి. నూకపల్లి శివారులో క్రాస్ రెగ్యులరేటర్ సమీపంలో వరదకాలువ మూడవ సారి కోతకు గురైంది. సమీపం ఎర్రకుంట నుంచి వచ్చే నీటికి కాలువ పెద్దఎత్తున కోతకు గురైంది. గతంలో రెండు సార్లు మరమ్మతులు చేసినప్పటికీ మళ్లీ దెబ్బతిన్నదని రైతులు తెలిపారు. శాశ్వత ప్రతిపాదిక ఇన్‌లెట్ ఏర్పాటు చేయాలని కోరారు. రాంపూర్, బల్వంతపూర్, మానాల రహదారులు రాకపోకలకు అసౌకర్యంగా మారాయి

●భారీ వర్షంకు మల్యాల మండలం మద్దుట్లలోని ఆకుల గంగాధర్ అనే వ్యక్తి ఇంట్లోకి నీరు చేరి ఇళ్లు, ఆరుబయట వర్షపు నీరు నిండింది. దీంతో నీటిని తొలగించడానికి గాను గంగాధర్ జనరేటర్ ఏర్పాటు చేసి నీటిని తొలగించాడు.

మల్లాపూర్: దంచికొట్టుతున్న వర్షానికి మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో వర్షపు నీరుతో ప్రజలు అతలకుతలమవుతున్నారు. సోమవారం గ్రామాల్లోని రహదారులు, చెరువులు, కుంటలు, జలకళ సంతరించుకున్నాయి. గోదావరి నది పరివాహక గ్రామాలు మొగిలిపేట, ఓబులాపూర్, సంగేమ్‌శ్రీరాంపూర్, వాల్గొండ, వివిరావుపేట తీర ప్రాంతాలలోని ప్రజలను రేవెన్యూ అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. మండలంలో దెబ్బతిన్న వంతెనలు, కల్వర్టులను అధికారులు పరిశీలించి ప్రజలను అటువైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

గోదావరితీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఇబ్రహీంపట్నం: ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ పూర్తిగా నిండటంతో అధికారులు గేట్లు అన్ని ఎత్తివేశారని దింతో గోదావరితీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు కోరారు. సోమవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడారు. గోదావరి వైపు ఎవరు వెళ్లవద్దని కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వెల్గటూర్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షా నికి మండలం లోని వాగులు వంకటు పొంగి పొర్లుతున్నాయి. వర్షపు నీరు వాగులు, చెరువులు, కుంటల లోకి చేరడంతో జల కళ సంతరిం చుకుంది. వెల్గటూర్ పెద్ద వాగు లోకి వరద ఉధృతి పెరుగుతోంది. ఏకధాటిగా వర్షం కురవడంతో కొన్ని చోట్ల పత్తి పంటలో నీరు నిలిచింది. ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించలేదు.



పునరావాస కేంద్రంలో గ్రామస్థులతో అధికారులు

●కడెం నారాయణ రెడ్డి ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువ ప్రాంతానికి వదలడంతో గోదావరిలో వరద పెరుగుతుందనే అంచనాతో ముందస్తుగా పాషిగామలో కొన్ని కుటుంబాలను సోమవారం పునరావాస కేంద్రానికి తరలించారు. తహసీల్దార్ శేఖర్, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై ఉమా సాగర్, ఇన్‌చార్జి ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంపీవో శ్రీనివాస్ ముంపు ముప్పు ఉన్న కుటుంబాల వారితో మాట్లాడి ట్రాక్టర్‌లో నేషనల్ హైవే పక్కన నిర్మించిన హరిత హోటల్‌కు తరలించారు. 14 కుటుంబాలకు చెందిన 62 మందిని పునరావాస కేంద్రానికి తరలించినట్లు తహశీల్దార్ శేఖర్ తెలిపారు.

బీర్‌పూర్: గోదావరి పరివాహక గ్రామాల ప్రజలను మండల అధికారులు సోమవారం పునరావాస కేంద్రాలకు తరలించారు. అడిషనల్ కలెక్టర్ గౌతమ్ రెడ్డి ఆదేశాల మేరకు తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో లచ్చాలు, డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ శ్రీనివాస్ గోదావరినది పరివాహక గ్రామాల ప్రజలతో మాట్లాడి పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఆరు గ్రామాల ప్రజలకు పునరావాస కేంద్రాలలో మండలంలోని తజా మాజీ ప్రజప్రతినిధుల సహకారంతో అధికారులు అన్ని ఏర్పాట్లను చేశారు. ఎప్పటికప్పుడు కమ్మునూర్ బ్రిడ్జి వద్ద గోదావరి నది ప్రవాహన్ని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో లచ్చాలు పర్యవేక్షిస్తున్నారు. గోదావరి పరివాహక ప్రజలను అడిషనల్ కలెక్టర్ గౌతమ్‌రెడ్డి, ఆర్డీవో మదుసూధన్ పర్యవేక్షణలో పునరావాస కేంద్రాలకు తరలించారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఎర్దండి గ్రామంలో గోదావరి ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో సోమవారం రాత్రి అధికారులు ముంపునకు గురయ్యే బాధిత కుటుంబాలను పునరవాస కేంద్రకు తరలించారు. మెట్‌పల్లి డిఎస్పీ ఉమా మహేశ్వరరావు, సీఐ నిరంజన్‌రెడ్డి, తహశీల్దార్ ప్రసాద్, ఎస్ఐ అనిల్‌లు, రెస్క్యూ టీం సిబ్బంది అక్కడకు చేరుకొని దాదాపుగా 50 కుటుంబాలను గ్రామంలో పునరావాస కేంద్రం జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు తరలించారు.

పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 2: ఏపీ డిప్యూటీ సీఎం, జనసేనా అధినేత, సినీనటుడు పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలను చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో స్థానిక కృష్ణానగర్‌లో గల సుప్రీమ్ బ్రేక్ డ్యాన్స్ స్టూడియోలో సోమవారం నిర్వహించారు. కేక్ కట్ చేసి పవన్‌కళ్యాణ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు ఎండీ పాషా, టౌన్ ప్రెసిడెంట్ వొడ్నాల రాజేష్, ఎండీ మహ్మద్, రామాంజనేయులు, శ్రీనాథ్, షాఫిక్, వీరప్రసాద్, వెంకటేష్, అర్జున్, చిన్న గంగాధర్‌తో పాటు అభిమానులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్ : జనసేన వ్యవస్థాపకుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు జనసేన నాయకుడు వొడ్నాల రామారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని బండలింగాపూర్ గ్రామ శివారులోని గండి హనుమాన్ ఆలయంలో అర్చన చేశారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. వృద్ధాశ్ర మంలోని వారికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. నాయకులు సాయికృష్ణ, విజయ్ అబినవ్, అనిల్, రాకేష్, పాల్గొన్నారు.

మెట్‌పల్లి(ఇబ్రహీంపట్నం): పట్టణంలోని మాస్టర్ లైక్స్పాండో క్లబ్ మెట్‌పల్లి ఆధ్వర్యంలో ఎపి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. క్లబ్ అవరణలో మొక్కలు నాటారు. రారైస్ మిల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మైలారపు రాంబాబు, నావనంది రమేష్, అజయ్ పాల్గొన్నారు.

ఉత్సవాల ముగింపు

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 2 : జిల్లా కేంద్రంలోని పురాతనమైన శ్రీలోకమాత పోచమ్మతల్లి 62 వార్షికోత్సవ ఉత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. చివరి రోజు సోమవారంనాడు సాయంత్రం గోపాలకాలువలు, అమ్మవారి శోబాయాత్రతతో ఉత్సవాలను ఘనంగా ముగించారు. ముగింపు కార్యక్రమానికి మాజీ జడ్పీచైర్‌సర్పన్ దావ వసంతసురేష్, మాజీమున్సిపల్ చైర్మన్లు విజయలక్ష్మీ హాజరయ్యారు. ఆలయకమిటీ నిర్వాహకులు రాజేందర్, మనోహర్, పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

గొల్లపల్లి, సెప్టెంబరు 2: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని మండల ప్రత్యేకాధికారి సాయిబాబా అన్నారు. గొల్లపల్లి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ హాస్టల్‌ను ఎంపీడీవో రాంరెడ్డి, మండల ప్రత్యేకాధికారి సురేష్ రెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం మహాత్మ జ్యోతి బాపూలే హాస్టల్‌ను సందర్శించి పరిసరాల్లో నీరు నిలిచి ఉన్న ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ సిబ్బందితో ఆయిల్ బాల్స్ వేయించారు.

భారీ వర్షాలకు కూలిన ఇల్లు

కథలాపూర్, సెప్టెంబరు 2 : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని భూషణ రావుపేటలో సోమవారం చెన్నవేని దశరథం అనే వ్యక్తికి చెందిన ఇళ్లు కూలిపోయింది. ఇళ్లు కూలిన సమ యంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని బాధితుడు తెలిపారు. ప్రభుత్వం తనకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

పోలీసుల అవగాహన

రాయికల్, సెప్టెంబరు 2: భారీ వర్షాలతో వరదలు వస్తున్న నేపథ్యంలో గోదావరి పరివాహక ప్రాంతాలైన జగన్నాథ్‌పూర్, నాయకపు గూడెం ప్రాంతాలను జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రాయికల్ ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో పోలీసులు పరిశీలించారు. ప్రజలకు వరద సమీపించడంతో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. జగన్నాథ్‌పూర్ మాజీ సర్పంచ్ ఆత్రం బీర్‌సాబ్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సంఘ పటిష్టానికి కమిటీ కృషిచేయాలి

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 2: సంఘ పటిష్టత, సభ్యుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా నూతనంగా ఎన్నికైన కమిటీ కృషిచేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని ఇందిరాభవన్‌లో సోమవారం జిల్లా రెడ్డి జన సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నికవగా, కమిటీ సభ్యులు జీవన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తాటిపర్తి విజయలక్ష్మీ దేవేందర్‌రెడ్డి, సంఘ అధ్యక్షుడు కొప్పెర వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాంచందర్‌రెడ్డి, కోశాధికారి నేరెళ్ల భూమరెడ్డి, ఉపాధ్యక్షులు చంద్రశేఖ ర్, నాగిరెడ్డి రజిత, సంయుక్త కార్యదర్శులు నవీన్‌రెడ్డి, ప్రియాంక, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

మల్యాల, సెప్టెంబరు 2: మండలంలోని నూకపల్లిలో రైతుల నుంచి వ్యవసాయ అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. పంట రుణమాఫీ అయి రేషన్ కార్డులేని రైతులు స్వీయ ధృవీకరణతో దరఖాస్తులు అందించాలని జిల్లా వ్యవసాయ అధికారి వాణీ కోరారు. ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. అనంతరం దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు పరిశీలించారు.

వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మండల ప్రత్యేక అధికారి అనంద్ కుమార్

కోరుట్ల రూరల్, సెప్టెంబరు 2: వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో, మండల ప్రత్యేక అధికారి అనంద్ కుమార్ ప్రజలకు సూచించారు. సోమవారం మండలంలోని కల్లూర్, పైడిమడుగు గ్రామాలలో ఉధ్రిత్తంగా ప్రవహిస్తున్న వాగులను పరిశీలించి స్థానికులకు పలు సూచనలు సలహాలను అందించారు. కల్లూర్ గ్రామ శివారులోని పెద్ద వాగు వంతెనపై ఉధ్రిత్తంగా ప్రవహిస్తున్న వరదను పరిశీలించి రాకపోకలకు ఎవరిని అనుమతించవద్దని గ్రామస్థాయి అధికారులకు సూచించారు. పైడిమడుగులో గత రాత్రి భారీ వర్షంతో డబుల్ ఇళ్లలోకి నీరు చేరగా అధికారులు నిర్వాసితులను స్థానికంగా ఉన్న పాఠశాలకు తరలించి ఆశ్రయం అందించారు. తహసీల్దార్ కిషన్, ఆర్ఐ రాజేందర్ రావు గ్రామ కార్యదర్శులతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

రైతు రుణాలపై స్పష్టత ఇవ్వాలని నిరసన

కథలాపూర్, సెప్టెంబరు 2 : రైతులు తీసుకున్న రెండు లక్షల పైచిలుకు రుణాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండలంలోని భూషణరావుపేట రైతులు నిరసన వెలిబుచ్చారు. రేషన్ కార్డులు లేని రైతుల వివరాల నమోదుకు ఏఈవో శేఖర్ గ్రామ పంచాయతీకి రాగా నోరుకు నల్లగుడ్డ ధరించి వినతి పత్రం అందజేశారు. ఇప్పటికే రెండు లక్షల లోపు రుణం ఉన్న రైతులకే నానా రకాల నిబంధనలు పెట్టి పూర్తిస్థాయిలో మాఫీ చేయలేని ప్రభుత్వం ఇక్కట్లకు గురి చేస్తోందని ఆరోపించారు. రెండు లక్షలు పైబడి ఉన్న రైతులను ఇప్పటికీ ఆయోమయానికి గురి చేయడం సరికాదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బద్దం మహేందర్, బద్దం మహిపాల్, గడ్డం దేవారెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతు చేయించిన అధికారులు

కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్థులు

కొడిమ్యాల, సెప్టెంబరు 2: మండలలోని నల్లగొండ ఆలయ సమీపంలో గుంతలు పడ్డ రోడ్డును సోమవారం ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతు చేయించారు. ఈ నెల 27న గుంతల మయంగా మారిన ప్రధాన రహదారి శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి చొప్పదండి ఎమ్మెల్యే డా.. మేడిపల్లి సత్యం స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలను ఈ నెల 29న పరిశీలించి వెంటనే మరమ్మత్తు చేయాలని సం బంధిత ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో ప్రయాణీకుల సౌకర్యం కోసం ఆర్‌అండ్‌బీ డీఈఈ పి. సత్యనారాయణ, ఏఈఈ ఆదిత్యలు రోడ్డు మరమ్మతు చేయించటంతో నల్లగొండ గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

పేద ప్రజలకు అండగా సీఎంఆర్ఎఫ్

నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న జువ్వాడి నర్సింగరావు

మెట్‌పల్లి, సెప్టెంబరు 2(ఇబ్రహీంపట్నం): సీఎంఆర్ఎఫ్ చెక్కులు పేద ప్రజలకు అండగా నిలుస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. సోమవారం పట్టణంలో జువ్వాడి భవన్‌లో మెట్‌పల్లి మండలం, మెట్‌పల్లి పట్టణానికి చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగ వాటిని లబ్ధిదారులకు అందజేశారు. మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఆరుగురికి, మెట్‌పల్లి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఎనిమిది మందికి 6,28,500 లక్షల విలువ గల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం, మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, ఆకుల లింగారెడ్డి, పూదరి నర్సా గౌడ్, యామ రాజయ్య, హన్మండ్లు, రాంప్రసాద్, తిరుతిరెడ్డి పాల్గొన్నారు.

జిల్లా పరిధిలో సీటీ పోలీస్‌యాక్ట్ అమలు

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 2: జగిత్యాల జిల్లాలో శాంతి భద్రత లను దృష్టిలో ఉంచుకొని నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పోలీస్ అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. ప్రజలు పోలీస్ వారికి సహకరించాలని కోరారు.

అదనపు ఎస్పీని అభినందించిన ఎస్పీ...: పార్లమెంట్ ఎన్నికల సమయంలో భారత ప్రధాని జిల్లా పర్యటనలో సందర్భంగా భద్రత పరంగా నిర్వహించిన విధుల్లో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు అదనపు ఎస్పీ ఏ. ఆర్ భీంరావుకు రాష్ట్ర డీజీపీ కామెండేషన్ లెటర్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ భీంరావును ఎస్పీ అశోక్‌కుమార్ సోమవారం అభినందించి కామెండేషన్ సర్టిఫికేట్ అందజేశారు.

గోదావరి ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

వెల్గటూర్, సెప్టెంబరు 2: గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరారు. సోమవారం పాషిగామలో హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీర ప్రాంత ప్రజలు అధికారులు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లాలని, ప్రభుత్వం వారికి అన్ని రకాల వసతులు కల్పిస్తామన్నారు. పునరావాస కేంద్రంలో ఉన్న వారికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉన్న వారు జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గోపిక జితేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి, మెరుగు మురళి పాల్గొన్నారు.

రాయికల్: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. రాయికల్ పట్టణంలో ఉధృతంగా పారు తున్న పెద్ద చెరువు మత్తడిని స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ అత్యవసర సమయంలో మాత్రమే ప్రజలు బయటకు రావాలని, పొంగుతున్న వాగులు, వంకలు, రోడ్లు దాటే ప్రయత్నం చేయవద్దని ప్రజలను కోరారు. పాత ఇళ్లల్లో ఉన్నవారు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉందని, వారు అధికారుల దృష్టికి తీసుకువస్తే గ్రామ, మండల కమ్యూనిటీ హాల్, ప్రభుత్వ స్కూల్ తదితర స్థలాల్లో ఉంచి ఆహారం, వసతి సౌకర్యం కల్పిస్తారని అన్నారు. భారీ వర్షాలకు రాయికల్ పట్టణంలోని పెద్ద చెరువు మత్తడి దూకుతుంది.



గ్రామస్థులతో మాట్లాడుతున్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

రాయికల్-ఇటిక్యాల మధ్య పెద్ద వాగు పొంగి పొర్లగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, కేడీసీసీ మాజీ చైర్మన్ పడిగెల రవీందర్ రెడ్డి, మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ మహేంద్ర బాబు, నాయకులు చంద్రతేజ, షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను తొలగించండి

కోరుట్ల, సెప్టెంబరు 2 : పట్టణంలోని వివిధ ప్రాంతాలలో చెరువులు కంటలను కబ్జాలు చేసి అక్రమంగా నిర్మాణాలను చేసారని వాటిని తొలగించి ప్రజల ఇబ్బందుల దూరం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణ డెవలప్మెంట్ పోరం సభ్యులు తహసీల్దార్ కిషన్‌కు వినతి పత్రం అందించారు. డెవలప్మెంట్ ఫోరం సభ్యులు పట్టణంలోని పలు ప్రాంతాలను సందర్శించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ పూర్తిగా జలమయం అయి ఉందని ఈ నిర్మాణం గతంలో ఓ వ్యాపారి మద్దుల చెరుకు వెళ్లే మాటు కాల్వను కబ్జా చేసి నిర్మాణం చేయడంతో వర్షాలు కురిసిన ప్రతి సారి ఇదే పరిస్థితి ఉంటుందని అన్నారు. ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట బాస్కర్, డెవలప్మెంట్ ఫోరం సభ్యులు చెన్న విశ్వనాథం, భూమేశ్వర్, రాజేందర్, సాహెద్ మహ్మద్ షేక్, ఎలిశెట్టి గంగారెడ్డి పాల్గొన్నారు.

వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలి

టీజీఎన్‌పీడీసీఎల్ చీఫ్ ఇంజనీయర్ తిరుమల్‌రావు

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 2: వినియోగదారులు విద్యుత్ పట్ల జాగ్రత్తగా ఉండాలని టీజీఎన్‌పీడీసీఎల్ చీఫ్ ఇంజనీయర్ తిరుమల్‌రావు సూచించారు. జిల్లా కేంద్రంలో విద్యుత్ శాఖ అధికారులతో సమావేశం అనంతరం సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. ఆయనకు స్థానిక జిల్లా ఎస్ఇ సాలియా నాయక్ జిల్లాలొ విద్యుత్ సరఫరాకు చేపట్టిన చర్యలను వివరించారు. చెట్లు విరిగిపడడంతో స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు, ఇన్సులేటర్లు దెబ్బతిన్నా యన్నారు. వరదల వల్ల నీట మునిగిన సబ్‌స్టేషన్‌లు, పిడుగులు పడి దెబ్బతిన్న చోట మరమ్మత్తులు పూర్తయ్యేలోపు ప్రత్యామ్నాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. భారీ వర్షాలతో జిల్లాలో చాలా నష్టం వాటిల్లిందని, విద్యుత్ సామగ్రి సరిపడా అందుబాటులో ఉంచామన్నారు. 24గంటలు క్షేత్ర స్థాయిలో విద్యుత్ సిబ్బంది, అధికారులు అందుబాటులో ఉంటూ, విద్యుత్ సరఫరాను మానిటరింగ్ చేస్తున్నారన్నారు. స్వీయ నియంత్రణ ముఖ్యమని ఎ ట్టి పరిస్థితుల్లో స్వయంగా విద్యుత్ మరమ్మతులు చేపట్టరాదని కోరారు. విద్యుత్ అంతరాయం, మరే ఇతర సమస్యలు ఉంటే వినియోగ దారులు జగిత్యాల డివిజన్ కంట్రోల్ రూం నెంబర్ 94408113938, మెట్‌పల్లి కంట్రోల్ రూం నెంబర్ 7901678208, జగిత్యాల సర్కిల్ ఆఫీస్ కంట్రోల్ రూం నెంబర్ 7901628366, టోల్‌ఫ్రీ నెంబర్ 1912, 18004250028 నెంబర్‌లకు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులున్నారు.

వైఎస్‌ఆర్ సేవలు మరువలేనివి

వైఎస్ఆర్ వర్ధంతిలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 2: దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి సేవలు మరవలేనివని, రాజకీయ రంగంలో ఘనకీర్తిని సాధించుకున్న మహోన్నత నేత స్వర్గీయ వైఎస్ఆర్ అని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ఇందిరా భవన్‌లో వైఎస్ఆర్ 15వర్ధంతిని పురస్కరించుకొని వైయస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బండ శంకర్, మాజీ మున్సిపల్ చైర్మెన్‌లు గిరి నాగభూషణం, తాటిపర్తి విజయలక్ష్మీ దేవేందర్‌రెడ్డి, బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, పట్టణ అధ్యక్షుడు కొత్త మోహన్, మాజీ జడ్పీటీసీ తాటిపర్తి శోభారాణి పాల్గొన్నారు.

కోరుట్ల : పట్టణంలోని జువ్వాడి భవనంలో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ రా వు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ అంజిరెడ్డి, కౌన్సిలర్ జిందం లక్ష్మీనారాయణ, ఎంబేరి నాగ భూషణం, మోర్తాడ్ లక్ష్మీనారాయణ నాయకులు పాల్గొన్నారు.

కథలాపూర్ : ఉమ్మడి రాష్ట్ర దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి వేడుకలు సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. వైఎస్ చిత్ర పటంకు పూలమాల వేసి నివాళులర్పించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, వర్ధినేని లింగారావు ఉన్నారు.

మల్యాల: మల్యాలలోని సోనియాగాంధీ గుడి వద్ద దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ నాయకులు ఆనందరెడ్డి, నెరెళ్ల సతీష్‌రెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మ్యాక లక్ష్మన్, కట్కం వినయ్, హరినాథ్, తిరుపతిరెడ్డి, శ్రీకాంత్, మల్లేశంగౌడ్, హనుమంతు, కిషన్‌రెడ్డి, రవి, రాజు ఉన్నారు

మల్లాపూర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఏలాల జలపతిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలోని అంగడి బజారులో వైఎస్ఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు చిలువేరి నారాయణగౌడ్, సీనియర్ నాయకులు మహిపాల్‌రెడ్డి, మల్లిఖార్జున్‌రెడ్డి, మాజీ వైస్ ప్రెజిడెంట్ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం జీవన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

భీమారం: భీమారం మండల కేంద్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బక్కూరి నరేష్, నాయకులు పతి గౌడ్, లచ్చా నాయక్, ఉమ్మడి రవి, తేలు రాజు పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని మూటపెల్లి గ్రామంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు గ్రామంలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఏలేటి దేవారెడ్డి, మండల జల రమేష్, తిరుపతి, నాయకుల శ్రీనివాస్, రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దివంగత మాజీ సీఎం వైఎస్ఆర్ వవర్ధంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నంది విగ్రహ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నేతలు దివంగత వైఎస్ఆర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఉపాధ్యక్షులు రాజేష్, పట్టణ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, లక్ష్మణ్, కస్తూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి(ఇబ్రహీంపట్నం): పట్టణంలోని జువ్వాడి భవన్‌లో సోమవారం కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం, మండల అధ్యక్షులు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆకుల లింగారెడ్డి, పూదరి నర్సాగౌడ్, యామ రాజయ్య, హన్మండ్లు పాల్గొన్నారు.

వెల్గటూర్: ఉమ్మడి అంధ్రప్రదేశ్ రాష్ట్ర దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ సేవలు చిరస్మరణీయమని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం వెల్గటూర్ మండలంలో వైఎస్ఆర్ వర్ధంతి నిర్వహించారు. పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గోపిక జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



జగిత్యాలలో నివాళులు అర్పిస్తున్న జీవన్‌రెడ్డి తదితరులు



మెట్‌పల్లిలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నర్సింగరావు

పెగడపల్లి : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్, మండల నాయకులు పాల్గొన్నారు.